క్లుప్తంగా

నైపుణ్యంతో రాణించండి



మాట్లాడుతున్న డీఎం రాజ్యలక్ష్మి

సత్తుపల్లి టౌన్: ఆర్టీసీ సంస్థ అభివృద్ధికి ఉద్యోగులు నైపుణ్యంతో వృత్తిలో రాణించాలని సత్తుపల్లి ఆర్టీసీ డీఎం కె.రాజ్యలక్ష్మి అన్నారు. సత్తుపల్లి ఆర్టీసీ డిపోలో గురువారం ఉద్యోగుల శిక్షణా తరగతుల్లో ఆమె మాట్లాడారు. ప్రయాణికులతో మర్యాదగా వ్యవహరిస్తూ ఆర్టీసీ సంస్థపై ఆదరణ పెంచాలన్నారు. పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ..



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

కొణిజర్ల: మండలంలోని పెద్దగోపతి, మల్లుపల్లి గ్రామాలలో పలు బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ గురువారం పరామర్శించారు. పెద్దగోపతిలో మాజీ సర్పంచ్ తడికమళ్ల దానియేలు కుమారుడు రవి కాల్వలో పడి మృతి చెందగా ఆయన చిత్రపటానికి పూల మాల వేసి ఎమ్మెల్యే నివాళులర్పించారు. మండలంలోని మల్లుపల్లికి చెందిన ఆలకుంట వీరయ్య, రాము, ముద్దంగుల శ్రీనివాస్‌లు ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోగా బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, సూరంపల్లి రామారావు, నారాయణరావు, తదితరులున్నారు.

స్టోర్లు ప్రారంభం

సత్తుపల్లి: కర్ణాటక, తెలుగు రాష్ట్రాల్లో కొనసాగుతున్న జీవీ మాల్ సత్తుపల్లిలో తొలిసారి హోం, బేబీ స్టోర్లతో విస్తరించడం అభినందనీయమని ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. సత్తుపల్లి జీవీ మాల్‌లో ఆమె గురువారం హోం, బేబీ స్టోర్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎండీ.గుర్రం, ఉమామహేశ్వరరావు, మేనేజర్ ఉదయభాస్కర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాబా ఆలయాల్లో పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

ఎర్రుపాలెం: మండలంలోని తక్కెళ్లపాడు, భీమవరం, ఎర్రుపాలెం గ్రామాల్లోని శ్రీ సాయి బాబా ఆలయాల్లో బాబా వారికి గురువారం అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. మండలకేంద్రంలోని ఆలయంలో వెంకటాపురం గ్రామానికి చెందిన అవులూరి శివారెడ్డి–గౌతమి దంపతులు, విజయవాడకు చెందిన చైల్డ్ ఎయిడ్ ఫౌండేషన్ నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మాతృభాషపై అవగాహన

సత్తుపల్లిరూరల్: ఒక భాషను చదవటం, రాయటం, మాట్లాడటం మరచిపోతే కాలక్రమేణా అది మృత భాషగా మారుతుందని విశ్వశాంతి విద్యాలయం ప్రిన్సిపాల్ పసుపులేటి నాగేశ్వరరావు అన్నారు. అంతర్జాతీయ మాతృభాషా దినత్సవాన్ని పురస్కరించుకుని విశ్వశాంతి విద్యాలయంలో రెండు రోజులుగా విద్యార్థులకు మాతృభాషపై అవగాహన కోసం వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ మేరకు గురువారం విజేతలకు బహుమతులు అందించారు. ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, సత్యనారాయణ, శైలజ, రమణమూర్తి, మణి, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

వ్యాధులపై సర్వే



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ముదిగొండ: అసంక్రామిక వ్యాధులపై వైద్య సిబ్బంది గ్రామాల్లో గురువారం ఇంటింటి సర్వే కార్యక్రమం నిర్వహించారు. ముదిగొండలో వైద్యాధికారిణి అరుణాదేవి వైద్యపరీక్షలు నిర్వహించారు. 30 ఏళ్లు పైబడిన వారికి రక్తపోటు, మధుమేహం సంబంధిత పరీక్షలు నిర్వహించారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పెరుగుతున్న ఎండలు..

విస్తృతంగా జ్యూస్ పాయింట్లు, కూల్‌డ్రింక్ దుకాణాల ఏర్పాటు

- మార్కెట్లోకి పుచ్చకాయలు, కొబ్బరిబోండాలు..
- అందుబాటులో మట్టి కుండలు
- పెరుగుతున్న విద్యుత్ వినియోగం





అమ్మకానికి సిద్ధంగా ఉన్న పుచ్చకాయలు, కొబ్బరిబోండాలు



ఆదరణ కోల్పోతున్న గోలీ సోడా

మధిర: రోజురోజుకు ఎండలు పెరుగుతున్నాయి. ఫిబ్రవరి నెలలోనే ఎండ మంట పుడుతున్నట్లు అనిపిస్తుంది. సీజనల్ వారీగా కొనసాగే వ్యాపారాలు జోరందుకుంటున్నాయి. పగటి పూట ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ముఖ్యంగా ఎండాకాలం సీజన్లో జ్యూస్ పాయింట్లు, కూల్ డ్రింక్స్ దుకాణాలు విచ్చలవిడిగా వెలుస్తున్నాయి. యువత ఐస్‌క్రీం, చల్లని పానియాలకు మొగ్గు చూపుతున్నారు. కొబ్బరిబోండాల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఒక్కో బోండాం రూ.60కు విక్రయిస్తున్నారు. కొబ్బరి నీరు లీటర్ రూ.150కి అమ్ముతున్నారు. వివిధ కూడళ్లలో, రోడ్ల పక్కన గుడారాలు ఏర్పాటుచేసి పుచ్చకాయలను అమ్ముతున్నారు. కొబ్బరినీళ్లు, చెరుకు రసం, లస్సి, నిమ్మరసం వంటి పానీయాలను, అరటి, బత్తాయి, సపోట, ద్రాక్ష, పైనాపిల్, కర్బూజా వంటి జ్యూస్ తాగి వేసవి తాపానికి సేద తీరుతున్నారు. గోలి సోడాకు ఆదరణ తగ్గుతుంది. మధిర, వైరా, సత్తుపల్లి, ఖమ్మంకు వెళ్లే ప్రధాన రహదారుల పక్కన చెట్ల కింద సీజనల్ వ్యాపారాలు ఊపందుకున్నాయి. పేదవాడి ఫ్రిజ్‌గా పేరుగాంచిన మట్టికుండలు అందుబాటులోకి వచ్చాయి.

ఏసీలు, ఫ్రిజ్‌లకు డిమాండ్..

అదేవిధంగా ఫ్రిజ్‌లు, ఏసీలు, కూలర్ల ధరలకు రెక్కలు వచ్చాయి. పాత ఏసీలను, కూలర్లను వర్కర్లతో సర్వీసింగ్ చేయిస్తున్నారు. ఒక్కో ఏసీ సర్వీసింగ్‌కు రూ.1,000 నుంచి రూ.1200 వరకు వసూలు చేస్తున్నారు. ఎండ పెరగడంతో ఉక్కపోతతో చిన్నారులు, వృద్ధులు ఇబ్బంది పడుతున్నారు. భవనాల్లో వేడి ఎక్కువగా ఉండి ఫ్యాన్లను, ఏసీలను, కూలర్లను వినియోగిస్తున్నారు. దీంతో విద్యుత్ వినియోగం రోజురోజుకు పెరుగుతుంది. ఎండవేడి ఎక్కువగా ఉండటం వల్ల మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జనం రద్దీ తక్కువగా ఉండడంతో ప్రధాన రహదారులు బోసిపోతున్నాయి.

బిజీగా ఉంటున్నాం



ఎండలు పెరగడం వల్ల ఏసీలు, కూలర్ల వినియోగం పెరిగింది. ఏసీల ఫిట్టింగ్, సర్వీసింగ్ పనులతో సీజన్ ప్రారంభమైంది. పనికి తగ్గట్టు డబ్బులు తీసుకుంటున్నాం. వర్కర్లు పనులతో బిజీగా ఉంటున్నారు.

– పిల్లలమర్రి ప్రసాద్, ఏసీ వర్కర్

సీజన్ ప్రారంభమైంది



ఎండాకాలం రావడంతో జ్యూస్ పాయింట్లకు సీజన్ పెరిగింది. వేసవి తాపానికి కొంతమంది పండ్ల రసాలు, చెరుకు రసం, లస్సి, కొబ్బరి నీళ్లు తాగుతుండగా మరి కొంతమంది కూల్‌డ్రింక్స్ వంటి చల్లని పానీయాలను తాగుతున్నారు.

– లక్ష్మి, చెరుకు రసం వ్యాపారి

ధరలు పెరిగాయి



కాకినాడ, రాజమండ్రి ప్రాంతం నుంచి కొబ్బరిబోండాలను తీసుకువచ్చి విక్రయిస్తున్నాం. కొబ్బరి బోండాలు దిగుబడి తక్కువగా ఉండటం వల్ల రేటు పెరిగింది. అక్కడ కొనుగోలు ధరలు పెరగడంతో ఇక్కడ కూడా ధరలు పెంచాల్సి వచ్చింది.

– షేక్ బాజీ, కొబ్బరి బోండాల వ్యాపారి

‘ఏకలవ్య’లో వసతులు కరువు



పరుపులను పరిశీలిస్తున్న నాయకులు

కారేపల్లి: గిరి పుత్రులను అన్ని రంగాలలో ఉన్నతంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఏకలవ్య మోడల్ స్కూల్‌లో కనీస వసతులు కరువయ్యాయని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భూక్యా వీరభద్రం ఆరోపించారు. గురువారం మండలంలోని రేలకాయలపల్లి గ్రామంలో నిర్మించిన ఏకలవ్య మోడల్ స్కూల్‌ను గిరిజన సంఘం ఆధ్వర్యంలో సందర్శించారు. విద్యార్థుల మెనూ, క్రీడా సామగ్రి, దుస్తులు, బెడ్లను పరిశీలించారు. తరగతి, వసతి గదులను పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడారు. 15 ఎకరాల్లో ఏర్పాటు చేయాల్సిన ఏకలవ్య స్కూల్‌ను కేవలం తొమ్మిది ఎకరాల్లో నిర్మించారని, చదువులతో పాటు, క్రీడల ప్రాధాన్యతగా వెలిసిన ఏకలవ్య స్కూల్‌లో ఆట స్థలం లేకపోవటం దారుణమన్నారు. మారుమూల ప్రాంతంలో నిర్మించిన పాఠశాలకు దరిదాపుల్లో కూడా వైద్య సదుపాయాలు లేవని, ఆహార పదార్థాల సరఫరాలో నాణ్యత లేదని, గదుల్లో ఫ్యాన్లు, లైట్లు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. నాయకులు శోభన్‌నాయక్, ధరావత్ వినోద్‌నాయక్, రణదేవ్ పాల్గొన్నారు.

రైతుభరోసాను అమలు చేయాలి

చింతకాని: రైతుభరోసాను పూర్తిస్థాయిలో అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా కోశాధికారి కూచిపూడి రవి డిమాండ్ చేశారు. మండల పరిధిలోని వందనం గ్రామంలో సంఘం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా మిర్చి ధరలు పతనమై రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారన్నారు. రైతు సంక్షేమాన్ని విస్మరించిన ఏ ప్రభుత్వం మనుగడ సాధించలేదన్నారు. ఈ సందర్భంగా సంఘం గ్రామశాఖను ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అవుల హరీష్, ప్రధాన కార్యదర్శి అవుల పిచ్చయ్యతో పాటు మరో 8 మందిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో అవుల మంగయ్య, సుంకు కృష్ణారెడ్డి, అమర్లపుడి వెంకన్న, పుల్లయ్య, షేక్ పాషా, తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ ఆలయానికి స్థలం కేటాయించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బోనకల్: గిరిజనుల ఆరాధ్యదైవం శ్రీ సేవాలాల్ మహరాజ్ ఆలయ నిర్మాణానికి ప్రభుత్వం స్థలం కేటాయించాలని గిరిజన సంఘం నాయకులు గురువారం తహసీల్దార్ పున్నం చందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఆ సందర్భంగా నాయకులు గుగులోతు పంతు, మాజీ జెడ్పీటీసీ బానోతు కొండలు మాట్లాడుతూ... ట్రైకార్ లోన్‌లకు నిధులు విడుదల చేయాలని, గిరిజన రైతులు సాగు చేసుకుంటున్న బంజరాయి, ఇనాం భూములకు పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వాలన్నారు. నాయకులు గుగులోతు నాగేశ్వరరావు, గుగులోతు రమేష్, భూక్యా పిచ్చేశ్వర్ నాయక్, నరేష్, బానోత్ శివలాల్, హుస్సేన్, భూక్యా రమేష్, తేజావత్ సక్రూ పాల్గొన్నారు.

అన్నదానం

సత్తుపల్లిరూరల్: మండల పరిధిలోని గంగారం గ్రామానికి చెందిన సుగ్గల బాబురావు దివ్యాంగులు, యాచకులు, వృద్ధులకు గురువారం అన్నదానం నిర్వహించారు. ప్రతీ ఒక్కరు పేదలకు సేవా కార్యక్రమాలు చేయాలన్నారు.

ఏఎస్సై శ్రీనివాసులుకు అభినందన



శ్రీనివాసులుకు శుభాకాంక్షలు తెలుపుతున్న సీపీ సునీల్ దత్

పెనుబల్లి : వీయంబంజర్ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న పొట్లపూల శ్రీనివాసులు ఏఎస్‌ఐగా పదోన్నతి పొందారు. ఈ మేరకు కమిషనర్ సునీల్‌దత్ శ్రీనివాసులకు గురువారం శుభాకాంక్షలు తెలిపారు. శ్రీనివాసులు ప్రస్తుతం వేంసూరు మండలంలో స్పెషల్ బ్రాంచ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

వధూవరులకు పొంగులేటి ఆశీర్వాదం

వైరా: వైరాకు చెందిన తుమ్మా శ్రీనివాసరావు కూతురు వివాహానికి రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హాజరైన నూతన వధూవరులను ఆశీర్వదించి నూతన వస్త్రాలు అందజేశారు. ఆయన వెంట ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, వైరా మున్సిపల్ మాజీ చైర్మన్ సూతకాని జైపాల్, నాయకులు బాణోత్ విజయాబాయి, దార్నా రాజశేఖర్, శీలం వెంకటనర్సిరెడ్డి, గరిడేపల్లి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక విద్యే భవితకు పునాది



విజేతలతో ఎంఈఓ నక్కా రాజేశ్వరరావు, ఉపాధ్యాయులు

సత్తుపల్లిరూరల్: విద్యార్థుల భవిష్యత్‌కు ప్రాథమిక విద్యే పునాదని వారిలో అంతర్గతంగా దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి వారి సర్వతో ముఖాభివృద్ధికి పాటుపడేలా ప్రతీ ఉపాధ్యాయుడు కృషి చేయాలని ఎంఈఓ నక్కా రాజేశ్వరరావు కోరారు. గురువారం సత్తుపల్లి పాతసెంటర్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి టాలెంట్ టెస్ట్, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... ఉపాధ్యాయులందరూ తమ పిల్లలను ఈ పోటీలకు సంసిద్ధులను చేస్తూ కొత్తగా చేరబోతున్న వారికి ప్రేరణ కలిగించాలన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమం నిర్వాహణకు, బహుమతులకు రూ.10వేలు అందజేసిన సిద్ధారం పాఠశాల హెచ్ఎం బాలయ్యను సన్మానించారు. అనంతరం పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కాంప్లెక్స్ చైర్మన్లు శైలకుమారి, యాకూబ్, జయరాజు, సెక్రటరీ సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.

ధర పెంచి చేపల అమ్మకం

సత్తుపల్లిరూరల్: కోళ్లకు వైరస్ సోకుతోందన్న ప్రచారంతో చాలామంది చికెన్ తినడానికి ఇష్టపడడం లేదు. ఇదే అదునుగా చేపల వ్యాపారులు ఇష్టారాజ్యంగా ధరలు పెంచుతున్నారనే ఆరోపణలు వస్తున్నారు. సత్తుపల్లి మండలంలో చేపలు కేజీ రూ.100 నుంచి రూ.120 వరకు అమ్మేవారు. కొన్నిచోట్ల బుట్టల్లో తీసుకొచ్చే వారు రూ.150కి అమ్ముతున్నారు. అయితే, చెరువుల వద్దకు వెళ్తే రూ.100కు కేజీ చొప్పున చేపలు లభించేవి. ఈక్రమాన మండలంలోని బేతుపల్లి పెద్ద చెరువులో సొసైటీ ఆధ్వర్యాన చేపలు పడుతుండగా వెళ్లిన ప్రజలకు నిరాశ ఎదురైంది. కేజీ రూ.140కి అమ్ముతుండడంతో సొసైటీ బాధ్యుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ వెనుదిరిగారు. కాగా, సత్తుపల్లి మండలంలోని కొన్ని చెరువుల్లో చికెన్ వ్యర్థాలు, చనిపోయిన కోళ్లను వేస్తున్నారనే ప్రచారం ఉన్నందున అధికారులు స్పందించాలని, ధరల పెంపుపైనా సొసైటీలతో చర్చించాలని ప్రజలు కోరుతున్నారు.

‘సాయిస్ఫూర్తి’లో స్టూడెంట్స్ ఫోరం



సభ్యత్వాలు అందుకున్న విద్యార్థులతో యాజమాన్యం

సత్తుపల్లిరూరల్: మండలంలోని గంగారం సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలలో ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఎలక్ట్రానిక్ అండ్ టెలీ కమ్యూనికేషన్స్ ఇంజనీర్స్(ఐఈటీఈ) అంశంపై ఈసీఈ విద్యార్థులతో స్టూడెంట్స్ ఫోరం ఏర్పాటుచేశారు. అనంతరం పలువురికి సభ్యత్వాలు ఇచ్చారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతిక విషయాలపై పట్టు సాధించేలా ఫోరం వారధిగా నిలుస్తుందన్నారు. ప్రిన్సిపాల్ పూటుకూరి శేషారత్నకుమారి, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ పాముల శేఖర్‌బాబుతో పాటు డాక్టర్ షేక్ రియాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ తక్షణ పునరుద్ధరణకు కృషి



ప్రత్యేక టీమ్‌తో విద్యుత్ శాఖ అధికారులు

వైరా: రాబోవు వేసవి కాలంలో ప్రకృతి వైపరీత్యాలు, ఇతర కారణాలతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే అందుకు సంబంధించిన లోపాలను సరిదిద్ది తక్షణ సరఫరాకు ప్రత్యేక బృందం సభ్యులు కృషి చేస్తారని వైరా ఏడీఈ కిరణ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు వైరాటౌన్, వైరా రూరల్, బోనకల్ సెక్షన్‌లలో ఏర్పడే విద్యుత్ అంతరాయాలను తక్షణమే పునరుద్ధరించేందుకు రాబోవు నాలుగు నెలలకు గాను విద్యుత్ శాఖలో ఆరుగురు సభ్యులతో కూడిన స్పెషల్ టీమ్‌ను శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ స్పెషల్ టీమ్‌కు కావాల్సిన సామగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈ పీ.సుందర్, వైరా రూరల్ ఏఈ వెంకటసాయి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమిస్తాం



విశ్రాంత ఉద్యోగులను సన్మానిస్తున్న బాధ్యులు

సత్తుపల్లి టౌన్: ప్రభుత్వాన్ని మార్చడంలో విశ్రాంత ఉద్యోగులు క్రియాశీలక పాత్ర పోషించారని, ప్రస్తుత ప్రభుత్వం కూడా పెన్షనర్ల సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కళ్యాణం కృష్ణయ్య అన్నారు. గురువారం స్థానిక సంఘం భవనంలో పెన్షనర్ల డే ని ఘనంగా నిర్వహించారు. వృధాప్య దశలో వచ్చే వ్యాధుల చికిత్సకు ఉపయోగపడే ఆరోగ్య పథకాన్ని అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. అనంతరం గతేడాది ఉద్యోగ విరమణ చేసిన 27 మంది విశ్రాంత ఉద్యోగులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కేశవరెడ్డి, చెంచిరెడ్డి, రఘుపతిరెడ్డి, బద్రుద్దీన్, రామిశెట్టి సుబ్బారావు, సాంబశివరెడ్డి మధుసూదన్‌రాజు, దాసు పాల్గొన్నారు.

రైతు కుటుంబాన్ని ఆదుకోవాలి



పరామర్శిస్తున్న రైతు సంఘం నాయకులు

చింతకాని: పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతు నెర్సుల ఎల్లయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని రైతుసంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బొంతు రాంబాబు, మాదినేని రమేష్ డిమాండ్ చేశారు. మండల పరిధిలోని లచ్చగూడెం గ్రామంలో బాధిత రైతు కుటుంబాన్ని గురువారం వారు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం ఇవ్వాలని, నివాసం ఉండటానికి కనీసం ఇల్లు కూడా సక్రమంగా లేదని, ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రభుత్వం అండగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మధిర డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు, మండల కార్యదర్శి రాచబంటి రాము, వత్సవాయి జానికిరాములు, నన్నక కృష్ణమూర్తి, కోటేశ్వరరావు, మేకపోతుల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

రవీందర్ గెలుపుతో సమస్యల పరిష్కారం



మాట్లాడుతున్న పురుషోత్తమరావు

తల్లాడ: బహుజన ఉపాధ్యాయ సంఘాలు బలపర్చిన ఖమ్మం, నల్గొండ, వరంగల్ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పూల రవీందర్ గెలుపే బహుజన కులాల భవిషత్‌కు మలుపని మున్నూరు కాపు సంఘం తెలంగాణా రాష్ట్ర అపెక్స్ కౌన్సిల్ కన్వీనర్ పురుషోత్తమరావు పటేల్, హిందూ బీసీ మహాసభ జాతీయ అధ్యక్షులు బత్తుల సిద్ధేశ్వర పటేల్ అన్నారు. మండలకేంద్రంలో గురువారం జరిగిన సంఘం సమావేశంలో వారు మాట్లాడుతూ... పూల రవీందర్ గెలుపుతో బహుజన కులాల హక్కుల పరిష్కారానికి వేదిక అవుతుందన్నారు. ఈ సమావేశంలో బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు పర్వతం సతీష్ పటేల్, నాయకులు పరికిపండ్ల అశోక్, మాధురి మధు పటేల్, కోసూరు వేలాద్రి, బెల్లంకొండ ఆంజనేయులు, దుగ్గిదేవర వెంకట్ లాల్, ఎర్రి నరసింహారావు, గోవిందు శ్రీనువాసరావు, గోగుల వెంకటేశ్వరరావు, చలమల రాధాకృష్ణ, తోట శ్రీనువాసరావు, చేడే వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ సత్తుపల్లి అధ్యక్షుడిగా విశ్వనాథ్



నియామక పత్రం అందుకుంటున్న విశ్వనాథ్

పెనుబల్లి: సత్తుపల్లి నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పసుమర్తి విశ్వనాథ్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన యూత్ కాంగ్రెస్ శిక్షణా శిబిరంలో ఆయన నియామక పత్రం అందుకున్నారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారాని, పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానన్నారు.

సాగర్ జలాలతో చెరువులు నింపాలి

చింతకాని: మండలంలోని లచ్చగూడెం చెరువును సాగర్ జలాలతో నింపాలని ఆత్మ కమిటీ డైరక్టర్ కొప్పుల గోవిందరావు అన్నారు. ఈ మేరకు తహసీల్‌లో తహసీల్దార్ కూరపాటి అనంతరాజుకు రైతులతో కలిసి గురువారం వినతిపత్రాన్ని అందజేశారు. నీరు లేక పొలాలు ఎండుతున్నాయని, చెరువులు నింపి ఎండిపోతున్న పంట పొలాల్ని కాపాడాలన్నారు. రైతులు కొమ్ము జాన్‌రాజ్, సుధాకర్, నగేష్, మురళి, రాజయ్య, ఉపేందర్, గోపి, మాధవరావు, రామారావు, వేణు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న రైతులు